కథ

"జరిగినంత వరకూ జరగతాదిలే చిన్నాయినా... యింక మాత్రం నన్నాడికి పొమ్మని చెప్పబాకండి ...నాకా సౌకిర్యాలూ వొద్దు... వోళ్ల మాటలూ వొద్దు..." ఖండితంగా వున్న కొండమ్మ గొంతు విని డీలా పడిపోయాడు తిరిపాలు.

# పక్షి

## వి. ప్రతిమ

మొదులే కొత్త పండక్కి అమ్మిని తీసకరావాల... అల్లుడుకి కొత్త గుడ్డలు కొనియ్యాల... ఎట్ట ఎల్లబోద్దా ఈ పండగని సస్తా వుంటే ఈ యమ్మి నీలుగుడు మాటలూ... ఈ యమ్మి కతా ఆ నాయుడోళ్లింట్లో గూడ వది రూపాయలు పుట్టేట్టుగా లేవు... ప్చ్ఁ కూర్చున్న నులకమంచం మీదినుండి లెయిలేక నరాలు గుంజినట్టయి అట్టనే వెనక్కి వాలుకున్నాడు తిరిపాలు...

గుడిసె బయటనున్న పొయ్యిమీద అన్నం కింద ఎకేస్తా కుత కుత ఉడికిపోయింది మీరమ్మ...

"యాందిమే నువు జెప్పేది?... పెద్దోళ్లు... నీకు తిండి బెట్టేవాళ్లు ఒక మాటనకుండా వుంటారా?... మీ అమ్మయినా ఒక మాటనదా?... ఒక దెబ్బ గొట్టదా?.. నువు చిన్న మనిషివి గాదులే,ఆ నాయుడమ్మని ఎట్టంటే అట్ట మాట్లాడుంటావు.. తక్కువయిన దానివా?.. యిక్కడ ఒకమ్మినీ పెట్టుకోని చెయిలేక సస్తా వుంటే... నీ బుడ్డ బెదిరింపు ల్యాందిమే? విదిలించింది_ కొండమ్మని...

అప్పటికి సద్ది కూట్యాళయింది... బర్రెల్నిప్పి పిచ్చిరెడ్డి తోపుసాయ తోలక పోవాల్సిన రంగమ్మ పని మరిచి చినమ్మ సాయా, అక్క సాయా మార్చి మార్చి చూస్తా వుంది...

అక్క నాయుడోళ్ళింటి కాడ పనిచేయ లేనంటూంటే చినమ్మా, చిన్నాయినా పొమ్మని తొందర పెట్టడం ఆ పిల్లకి దిగులుగా, కష్టంగా వుంది... అక్కకి అసలే కాలు అయివు... ఆ యింట్లో బండ చాకిరీ... ఎంత చేసినా నాయుడమ్మ తిడతానే ఉంటాది.. 'నేను పోనని' గట్టిగా చెప్పమని అక్కకి సైగ్గా సైగ చేసింది రంగమ్మ...

"కొండమ్మా... నేన్చెప్పే దినుమేఁ.. ఆ నాయుడింట్లో వుండే గదా నువ్విన్ని ప్యాసన్లు నేర్చినావుఁ... మనవనుకుందాం, గుడ్డెట్ట కట్టుకోవాలో, తలెట్ట దువుకోవాలో అన్నీ అక్కడే గదా నేర్చినావు.

దినుమ్మూ నీళ్లు పోసుకుంటున్న్యామా మనింటి కాడ.. ఇదిగో తాగను సుక్క నీళ్లులేక అల్లాడుతుండాము... నువ్వన్నా లచ్చనంగా పెద్దోళ్లింట్లిం బతికి పోతావనుకుంటే మల్లిదేందిమేఁ...మంచిఇల్లూ, మంచి తిండీఁ నా మాటిని పదాంబా..." ఉన్నట్టుండి మంచం మీద లేచి కూర్చున్నాడు తిరిపాలు...


రంగమ్మ అక్క మా చేతిని పొడస్తా ఎక్కేసింది. వెళ్లనని చెప్పమంటూ కొండమ్మ గొంతు బిగ పట్టుకుని ధైర్యాన్ని ఎరువు తెచ్చుకుంది...

"ఇదిగో చిన్నాయినా... నువ్వు మళ్లీ గిన నన్నంపించాలని చూసినావంటే నేన్చెప్తుండా పురుగుల మందన్నా తాగేస్తా... చెరువు కట్ట మీదుండే యాప చెట్టుకన్నా ఉరేసుకుంటా" చెప్పింది కొండమ్మ.

"అవున్లే దూకి సావడానికి చెర్లో సుక్క నీళ్లు ల్యాక పాయ..." అన్నం వారుస్తా దెబ్బి పొడిచింది మీరమ్మ.

మీరమ్మకి ఒళ్లంతా సెగలు రేగినట్లుగా మంటలు పెడుతోంది. తన కూతురి పెళ్లయి మూడు నెలలయింది. ఆ అప్పులింకా తీరనే లేదు. ఉగాది పండగొచ్చేసింది. ఆ యమ్మిని తోడకొచ్చి అన్నీ పెట్టి పంపించాల. ల్యాకపోతే అత్తోళ్లింట్లో ఆ యమ్మికి మాట... ఈ నడవఁ వూళ్లో పనుల్లేక చిల్లిపైసా అన్నా లేదు చేతిలో... సరేఁ కొండమ్మ పని చేసే కాడికి బొయి అయిదొందలడిగి తెచ్చుకుందామనుకుంట్రి మొగుడూ పెళ్లాలిద్దరూ.

ఈ యమ్మి గబక్కిన చెప్పా పెట్టకుండా వొచ్చేసింది గాక రాయి మాదిరి తిని



కొ జా చ్లో నుండాది వ ంగా డ ం దినాల్నుండీ... మాటా, పలుకూ ల్యాకుండా... యిహ నేమియి బోతారోళ్లు...?"

అసహాయతతో, ఏమీ చేయలేని తనంతో ఉద్రేకం పెరిగి పోయింది మీరమ్మకి...


"మీ యమ్మా, నాయినా కని నా యదాన దోసి పొయినారే లంజల్లారా. తిని కూసో నుండండి చేసి పెడ్తాను. నాకు మాత్రముండాది కండల్లో సత్తవ." ఇద్దరి ముఖాల మీదా మెటికలు విరుస్తూ పైపైకి దూకింది.

అయితే కొండమ్మకీ, రంగమ్మకీ ఊహ తెలిసిన్నాటి నుండీ మీర చినమ్మ ఈ మాటలంటానే వుండాది. ఈపొద్దు కొత్తేం గాదు. కళ్లు తుడుచుకుంది రంగమ్మ. కొండమ్మ మాత్రం చలనం లేని స్థంభంలా నిలబడి వుంది.

మీరమ్మ నోరు నొప్పి పుట్టేదాక అరిచి, అరిచి గుడిసె లోపలికి బొయి ఎరగడ్డల పులుసు కలుపుకొచ్చి పొయిమీద పెట్టింది... అసలు అన్నం వార్చింది మొదులూ యిప్పటిదాకా ఉత్త పొయి పోవడం ఈ ముండల వల్లేనంది...



గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన సామాజిక కథ



పొద్దుట్నుండీ ఈ తిరణాలలో పడి బర్రెలకాడ పేడ జవరనందుకు తన్ను తాను తిట్టుకుంటూ పాత రేకుతో బర బరా కసువూ, పేడా లాగడం మొదలుపెట్టింది... నోరు మాత్రం ఆడతానే ఉంది...

మీ అమ్మా, నాయినా పోతా, పోతా మిమ్మల్నిద్దర్నీ గూడ తీసుకు పొయ్యింటే బాగుండునన్నది... వీళ్లిద్దరి వల్లే తన ఒక్కగా నొక్క కూతుర్ని సరిగా చూడలేక పోయానన్నది ... ఈ రెండు పొట్టల్నీ అదనంగా నింపాల్సి వచ్చినందువల్ల బతుకులో ఒక గుడ్డపాత గూడ కొనుక్కోలేక పోయానన్నది.. ముగ్గురాడ పిలకాయలు యింట్లో వుండారని చిన్న వయసులోనే మొగుడి పక్కన పడుకోవడం మానేశానన్నది. బతుకులో పోగొట్టుకున్నవన్నీ ఎన్నెన్నో ఏకరువు పెట్టసాగింది.

మంచంమీద వెల్లకిలా పడుకుని చింతచెట్టు సందుల్లో నుండి ఆకాశానికేసి చూస్తోన్న తిరిపాలుకి కూడ మీరమ్మ మాటల్లో పొల్లు



సాంఘిక సామాజిక కథల పోటీలో నా కథ 'పక్షి' ద్వితీయ బహుమతి పొందినందుకు సంతోషంగా ఉంది. నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట మా నివాసం. చదువు బి.యస్.సి. భర్త పేరు డా.వి.వి.కుమార్‌రెడ్డి. ఇప్పటివరకు నేను 83 కథలు, 34 కవితలు రాశాను. నా తొలికథ 'యముడికి హాలిడే' 1989లో ప్రచురితమైంది. నేను రాసిన కథల్లో బహుమతి పొందినవి "సింధు (1991, ఆంధ్రభూమి), ఏ రాయి అయితే నేం (1992, తొలిప్రొద్దు), వంందు (1992, ఆంధ్రభూమి), పోటీ (1993, ఆంధ్రజ్యోతి, న్యూజెర్సీ), బతుకు భాగహారం (1996, చీరాల సాహితీ సమాఖ్య), నాన్నకో ఉత్తరం (1997, ఆంధ్రజ్యోతి, న్యూజెర్సీ), గంగ జాతర (2000, ప్రజాశక్తి), అడవిలో మొక్క (2000, రచన), రాచపుండు (2002 ఆటా), హాలాహలం (2003, ఆటా). 'మాక్కొంచెం నమ్మకమివ్వండి (కదంబం), నాన్నకో ఉత్తరం (అభినందన), బతుకు అంచుల్లో (సరికొత్త కథ), అక్క ఈగ (తెలుగుకథ99), జాగారం (తెలుగుకథ 2000), సాలెగూడు (కథాకేళి)' అనే కథలు వివిధ సంకలనాలలో చోటు చేసుకున్నాయి. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి సుమారు పది వరకు కథలు, నాటికలు ప్రసారమైనాయి. నా కథలకు ప్రేరణ తొలినుండి పఠనాసక్తి చదివిన మంచి రచనలు. సమాజంలోని చీకటి కోణాల్లోకి వెలుగు ప్రసరించే కథలు రాయలన్నది నా ఆశయం.

కన్పించలేదు... అన్నా, వదినా పోయినప్పట్నుండీ ఎన్నెన్ని బాధలు పడితే, ఎన్ని వస్తులుండి వాళ్ళ పొట్టలు నింపితే యింత పెద్దోళ్లయినారు. కాలు అయివు పిల్ల అని మరీ ఈ కొండమ్మని నెత్తిన పెట్టుకునే గదా సాకినాడు తను..

కూలీ, నాలీ చెయిలేదనీ, బర్రెల కాడుండి బండ చాకిరీ అసలే చెయిలేదనీ... ఈ డుంటే వోళ్ల చినమ్మ పిండేస్తాదే అనేగదా పేటలో ఇటిక శాల నాయుడోళ్లింటికాడ పెట్టింది. ఆడకు బొయినాకే గదా యింత బాగ తీరింది పిల్ల. ఏదో నాయుడమ్మ దగ్గిర పనీ, బాటా నేర్చుకుంటాది. ఇంక రెండేళ్లట్ట ఉణ్ణిందంటే పెళ్లికూడా నాయుడమ్మే జేసేస్తాది ... మనికి ఒక బాద్దిత తప్పినా తప్పినట్టే అని ఎంతాశ పడ్డాడు. అట్టాటి దీయమ్మి చెప్పా, చెయికుండా పరిగెత్తేసె... ఇట్ట నిగడ దీసుకుని కూర్చుంటే ఎట్ట జరగతాది? ఎన్నెన్ని కష్టాలు పడితే సంసారాన్ని లాగ్గలగతుండాము...

'ఏవన్నా పొలమూ, పుట్రా వుండాదా?... ఎంతసేపూ ఆ కూలికి పోతేనే గదా పొట్టకూటికి... ల్యాకుంటే వస్తులు పడుండాల్సిందే... ఆ కూలి పనయినా యాడ దొరకతా వుండాది... ఊరంతా తిండిబెట్టే పంటలు గాకుండా చెరుకేసేస్తిరి... ఆ చెరుకు తోటల్లో పని చేయడానికి అరవ దేశాన్నుండి కూలోళ్లొస్తుంటిరి.

గవుర్మెంటు స్థలాలంటిరి... అయి మనదాకా రాకపాయ... పనికి బియ్యమన్నారు... పనికి పిలవకుండానే మిషన్లతో పన్లయి పాయ. కరువు బియ్యమంటిరి కంటికే కనబడకపాయ... ఆఖరి కొకరికి తాగనుగూడ చుక్క నీళ్లు ల్యాకుండా పోతుండాయి.

నులకమంచం మీద వెనక్కి వాలుకుని, బతుకు లోతుల్లో నుండి ఆలోచిస్తోన్న తిరిపాలుని పెద్ద దగ్గుతెర కమ్మేసింది. అట్లే ముందుకు లేచికూర్చుని దగ్గసాగాడు శక్తి లేనట్లుగా.. అసలే పీక్కుపోయి వున్న తిరిపాలు బుగ్గలు మరింత లోతుకుపోయి మొటికలు మొటికలుగా పెరిగిన తెల్ల గడ్డంతో ముఖం భయంకరంగా కన్పిస్తోంది. ఎండుకు పోయిన డొక్కలు దగ్గు తీవ్రతకి ఎగిరెగిరి పడుతున్నాయి...

'మూడు దినాల్నుండీ గమనించలేదు గానీ, చిన్నాయిన మరీ తగ్గి పొయ్యుండాడు.' దిగులుగా తనలో తనే గొణుక్కుంది కొండమ్మ. చిన్నాయిన వైపు చూస్తూ... ఎంత కాదనుకున్నా నాయిన తమ్ముడు... చిన్నప్పట్నుండీ తనని సాకినోడు... అట్టాటి చిన్నాయిన మాట కాదని బాధ పెడ్తుండానేమోనని ఒక్కక్షణం ఆలోచనలో పడింది కొండమ్మ. ఆ క్షణాన్ని వినియోగించుకుంటూ మీరమ్మ ఎత్తుకుంది. ఈసారి అనునయంగా.

"అమీఁ ఈ ఒక్కసారికీ నా మాటినుమీఁ... పదాంబా నేను గూడొస్తాను. నాయుడు భార్యకి చెప్పి వొదిలి పెట్టొస్తాను. ఇదిగో మీ అక్కని ఉగాదికి తొడక రావాలని డబ్బులడిగి తెచ్చుకుంటాను! అంటూ బతిమాలుకుంది.

మీరమ్మ మాటలకి క్షణంపాటు కొండమ్మ మనసు కరిగింది. చిన్నమ్మతో గూడ పొయి నాయుడోళ్ల నడిగి డబ్బులిప్పిస్తావా అన్పించింది. మరుక్షణంలో ఏమనుకుందో, ఏమొ విసురుగా లేచిచిన్న కానుగ చెట్టు దాటి వాళ్ల అత్తోళ్ల యిళ్ల సాయ నడిచి పోసాగింది.

జారిపోయిన కోకని ఎగేసుకుంటూ మీరమ్మ నోరు తెరుచుకుని చూస్తుండి పోయింది... వెళ్లిపోతూన్న అక్కనీ, నిర్ఘాంతపోయి నిలుచున్న చినమ్మనీ చూస్తూ సందిగ్ధంలో పడింది రంగమ్మ.

తిరిపాలు ఎడా, తెరిపీ లేకుండా దగ్గుని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ దగ్గు తాలూకూ బాధామయ శబ్దం దూరంగా వెళ్తోన్న కొండమ్మ చెవుల్లో నుండి పాకి గుండెల్ని చుట్టేస్తోంది...

***

నక్కల కాలవలో చుక్క నీళ్లు లేవు... సుద్దంగా ఎండిపోయి బాతులోళ్లు కాపరాలు పెట్టేసుండారు. నేలంతా బీటలు పడి పిట్టలు తాగడానిక్కూడ బొట్టు నీళ్లుండటం లేదు... తన చిన్నపుడు ఈ కాలవ ఎంత నిండుగా పొంగిపొరేది. ఈ కాలవలోనే గదా తనూ, పక్కింటి రవణమ్మా ఈత నేర్చుకునింది. బర్రెల్ని తోట్లో దోలేసి ఎంతసేపూ ఎండకి ఈ కాలవలోనే ఈదులాడ్తాండేవాళ్లు రవణమ్మా, తనూ...

దేశమ్మ చెరువులో కూడా నిండా నీళ్లుండేవి... మెట్ట నేలలే అయినా చెరువు ఏటా రెండుసార్లు నిండి పదహారొందల ఎకరాలకి బతుకయి ఉండేది... అట్టాంటి దిప్పుడు చెరువుల సేద్యాలే లేకుండా బోతుండయి... బోర్లు, బోర్లని ఎంతెంత పొడుగు గొట్టాలెత్తెచ్చి నేలతల్లి గుండెల్లో దించినా గూడ చుక్కనీళ్లు పైకి రాకపాయ. వానలొస్తేనే గదా నీళ్లుండేదానికి. యింకా.. ఇంకా కొన్నేళ్లు పోతే వానంటేనే తెలీకుండా పోతాదేమొ...

వాన వున్నా, లేకపోయినా ఈ తంగేడు చెట్లు మాత్రం విరగబూసి వున్నాయి. వాటిమీద రంగురంగుల సీతాకోక చిలుకలు వాలి పులకరిస్తూ, రాగాలు తీస్తూ ఒక పువ్వు మీది నుండి మరో పువ్వు మీదికి, ఒక చెట్టుమీది నుండి మరో చెట్టు మీదికీ పొరాడుతున్నాయి... వాటిని చూస్తూంటే తనుగూడ ఏదో ఊపిరాడని చోటు నుండి వచ్చి హాయిగా యిక్కడ తిరుగులాడుతున్నట్టుగా ఉంది కొండమ్మకి. లేచి

ఆ చెట్టు దగ్గరికీ, ఈ చెట్టు దగ్గరికీ వెళ్లి పలకరించింది.

కొండమ్మ చిన్నపుడు సావాసగత్తెలంతా తంగేడు చెట్టును దేవతగా భావించే వాళ్లు. ఆ చెట్టు కన్పడితే చాలు ఒక్క పువ్వయినా కోసి తల్లో పెట్టుకోకపోతే ఆ తల్లికి కోపమొస్తుందనుకునే వాళ్లు. ఇప్పుడు తలుచుకుంటే కొండమ్మకి నవ్వొస్తుంది. అయినా తంగేడుచెట్టు దగ్గరగా వెళ్లి రెండు పూలు కోసి తల్లో పెట్టుకుని రెండు చేతులూ జోడించింది...

దూరంగా పైరు కోసిన కయ్యిల్లో బర్రెల్ని మేపుతోన్న రంగమ్మ అక్క చెట్ల సందుల్లో నుండి పరుగులు పెట్టి తిరగడాన్ని, అక్కి ఆనందాన్ని ఆశ్చర్యంగా గమనిస్తోంది... అయినా చినమ్మ అక్క నిక్కడుండనీదు . మరుక్షణంలోనే నల్లగా వున్న రంగమ్మ ముఖం మరింత నల్లబడిపోయింది...

రాధామాధవ తీగెల్లో నుండి రంగుపూలు కోస్తోన్న కొండమ్మకి హఠాత్తుగా ప్రతిరోజూ దేవుడి కోసం పూలుకోసే నాయుడమ్మ గుర్తొచ్చింది... అక్కడ రాధామాధవ తీగెని పడగ్గది కిటికీకి అల్లిచ్చారు... దీనిపేరు రాధామాధవ తీగ అని నాయుడమ్మే చెప్పింది తనకి ... నాయుడమ్మ యింకా చాలా చెప్పింది... చానా నేర్పింది... యింగిలీషు పదాలు కూడా నాయుడమ్మ వద్దే నేర్చుకుంది తను. రోజూ శుభ్రంగా స్నానం చేసి ఉతికిన గుడ్డ లేసుకోవడం, సబ్బుతో ఒల్లు రుద్దుకోవడం, కాళ్లకి చెప్పులేసుకోవడం, తలకి పిన్ను లేసుకోడం, గోళ్లకి రంగు పెట్టుకోడం యివన్నీ కూడ నాయుడమ్మని చూసే నేర్చుకుంది తను... అయితే మాత్రం తనేవన్నా పన్జేయకుండా డబ్బులు తీసుకుంటుండాదా?

కాలు యిట్ట పెట్టుకోని గూడ పొద్దన లేసింది మొదలూ, రాత్రి పదిగంటల దాకా నాయుడమ్మ ఏ పని చెప్తే ఆ పని చేసేది... ఒక్క నాయుడమ్మేనా? యింట్లో ఎంత మందుంటే అంతమంది. ఎన్ని పక్కలకి పిలిస్తే అన్ని పక్కలకి పరిగెత్తాల్సిందే. పాలు మాలేదానికి లేదు. ఇల్లూ, వాకిలీ పొద్దనా, సాయంత్రం చిమ్మాలి... ఇల్లంతా రూము రూముల్లో తడిగుడ్డతో శుభ్రంగా తుడిచి సర్దాలి... పైన చిమ్ముకు రావాల... ముందూ వెనకా వుండే చెట్లకీ, లానుకీ దండిగా నీళ్లు పట్టాల... బట్టలుతకాల... యింత జేస్తే గూడ అత్తా, కోడళ్లిద్దరూ దేనికో ఒకదానికి నస పెడ్తానే ఉంటారు... ఎంత చేసినా యింకా అది చెయిలేదు, ఇది చెయిలేదు అంటా వెంటబడ్తారు... మాట్లాడితే ఎదురు తిరిగి మాట్లాడిందంటారు... పలక్కపోతే జవాబు చెప్పవేమని గదమాయిస్తారు...

పిల్లలు కూడ అంతే. ప్రతీదానికీ దబాయిస్తారు... రాపాడతారు... మాట్లాడేదానికి ల్యా. మాట్లాడకుండా వుండేదానికి ల్యా... ఈ నాలుగు దినాల్నుండీ లానుకి నీళ్లెవురు పడ్తుండారో... బాత్రూములెవురు కడగతుండారో... వాకిట్లో ముగ్గు ఎవురేస్తుండారో...

ఇదంతా అట్టుంటే అప్పుడప్పుడూ నాయుడమ్మ తమ్ముడొస్తాడు పనున్నా, లేకపోయినా బెడ్రూములోకి పిలుస్తుంటాడు. ఏదో ఒక సాకు పెట్టి... వాడొస్తుండాడంటేనే భయం. తప్పిచ్చుకు తప్పిచ్చుకు తిరగతుండాల. ఛూ నాయుడమ్మ నసే భరించలేక సస్తుంటే వీడొకడు ప్రాణానికి. ఎందుకొచ్చిన బాధ. ఎంత తిండిపెట్ట, గుడ్డలిస్తే మాత్రం మనిషికి మించి శాకిరీ చెయ్యాలంటే అవతాదా?... చేసీ గూడ ఏవన్నా ఊరా... పేరా?... మెచ్చుకోకపోగా ఒకటేనస పెడ్తానే వుంటారు?... ఒక పూట




## బికినీయా? వద్దు!

అందిట కొత్త నటి రిమీసేన్. కోకాకాలో, తాజ్ మహల్ టీ ప్రకటనలతో రిమీ అందరికీ పరిచితురాలే. ఇప్పుడు ముకేశ్ భట్ చిత్రంలో కథకు అనుగుణంగా ఓ దృశ్యంలో బికినీ వేసుకోవాలంటే, వద్దు పొమ్మందిట. దాంతో ఆ ఛాన్సు పోయింది. కానీ అక్షయ్ ఖన్నాతో 'హంగామా'లో చేస్తున్నది. ప్రముఖగాయకుడు పలాశ్ సేన్ భార్య రిమీ. పెళ్లయిపోయినదాన్ని కదా, ఎందుకనుకుందో ఏమో మరి! అయినా, ఇవాళ్టి సుందరాంగులందరూ ఎంతగా ఎక్స్‌పోజ్ చేస్తే అన్ని అవకాశాలొస్తాయంటుంటే...!



అన్నం లేకపోయినా పడుండొచ్చు గాని ఒక మాటంటే పడదు తను.

అట్టని ఈడ్నే ఉండాలంటే అవతాదా?... తనకేవయినా అమ్మా, నాయినా వుండారా?... కూచనబెట్టి పెట్టడానికి... ఎప్పుడో చచ్చిపోయిన తల్లిదండ్రులు గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లూరాయి కొండమ్మకి. రంగమ్మ నొకదాన్ని చూడ్డానికీ చినమ్మ ఎన్నెన్ని మాటలడగతాది?... చిన్నాయనన్నాచ్చేస్తే శక్తి తగ్గిపోయి పనికి పోల్యాకుండా వుండాడు. చినమ్మ మాత్రం ఎంతకని చేస్తాది... పోనీ ఈడ్నే వుండి రవణా రెడ్డోరింట్లో పనికి కుదిరితే పొద్దన బొయి సాయంత్ర మొచ్చేయొచ్చు...

"రంగమ్మాః రవణారెడ్డోరింట్లో ఎవురుండారు పనికి?... ఆ రెడ్డెమ్మ నన్ను పనికి రమ్మని పిల్చేది అంతకుముందు..." చెల్లెలి దగ్గరగా పొయి ప్రశ్నించింది కొండమ్మ...

రంగమ్మ పెదవి విరిచింది... చేతులు తిప్పుతూ...

"ఇంక్యాడ రవణారెడ్డికా... మందు తాగి సచ్చిపొయినాడు... రెడ్డెమ్మ యిప్పుడిక్కడ్లేదు... కొడుక్కాడికెళ్ళిపోయింది. పాపం చెనిగేసినాడుకా... బాగ వచ్చిణ్ణింది. నీళ్లు చాలక మందు కొట్టినా తెగులు చావనే లేదంట... మొత్తం ఎనిమిదెకరాలూ నిలవనెండి పోయింది. ఏం చేస్తాడు చెప్పు? పోయినేడు గూడ పంట చేతికి రాల్యా... మందు దాగి అదిగో ఆ కయ్యిలోనే పడిపొయినాడు... పాపం పెదరెడ్డి ఎంత ఎంత బతుకు బతికినాడు?... ఎట్టంతా అవునన్పిచ్చుకున్నాడు" ఆరిందాలా చెప్తూ కళ్లు తుడుకుంది రంగమ్మ.

నిర్ఘాంతపోయి చూస్తోంది కొండమ్మ...

"మనం చెయ్యాలన్నా కూడ పనుల్లేవుకా... వానలు పడ్తే కదా కయ్యలు దున్నేదానికి... హె.. హె.. హె..." పక్కకి పోతోన్న బర్రెల్ని మళ్లిస్తూ మళ్లీ దూరంగా వెళ్లింది రంగమ్మ...

ఆలోచనలో పడింది కొండమ్మ. ఏం చెయ్యాల?

నాయుడమ్మ పిలకాయిల్ని తను రోజూ బడికి తీసక పొయ్యేది. ఆ టీచరమ్మ తనని ఆయాగా వొచ్చి చేరమని చానా రోజులుగా పిలస్తుండాది. ఆమెః దగ్గరి కెళ్లాల్సిందే... ఇంక్యాడికి బొయినా ఈ కాలు చూసి పనియ్యరు. అక్కడికి పోతే పని మరీ జాస్తిగా ఉండబోద్ది. జాస్తయినా ఫర్వాలే... ఎంత పనయినా జేస్తాది. మాటంటే మాత్రం ఓర్చుకోలేదు...

కొండమ్మ కలగా పులమయిన ఆలోచనలని అడ్డుకుంటూ "పొద్దు పోతా వుండాది యిహన పోదాం రాక్కా" పిలిచింది రంగమ్మ...

బయటి ప్రపంచానికి వెలుతురుగా వున్న ఆ సాయంత్రం ఆ అడవిలో మాత్రం తొందరగా చీకట్లని కమ్మేసింది.

***

సూర్యుడు భూలోకం మీదికి విహారాని కొస్తున్నందుకు సాక్షిగా ముందుగా సన సన్నటి వెలుగురేకలు లోకం మీదికి పారాడుతున్నాయి...

"ఒరే తిరిపాలా? కొండమ్మ యాడ్రా వుండేదిప్పుడు? ఆ నాయుడోళ్లింట్లో నేనా?..." మూడో యింట్లో వుండే వెంకటయ్య హడావిడిగా వచ్చి ప్రశ్నించాడు.

చిన్న దూడ మూతికి చిక్కం కడుతూన్న తిరిపాలు మెల్లిగా మోకాళ్లు సవర దీసుకుంటూ లేచి నిలబడ్డాడు...

"నాయుడోళ్లింట్లో లేదు వెంకటన్నా... ఎంత చెప్పినా యినకపొయ... బడి సాయిత్రమ్మ టీచరు కాడుండాది.... పిలకాయల్ని బడికి తొడకరానూ, వొదిలి పెట్టనూ, ముడ్డి గడగనూ, బడి చిమ్మనూ... చెయినూ ఛస్తా వుండాదనుకో... చెయి లేకుంటుండాదని ఆడ్యాడ్నో బేరిపేటలో పెద్ద మిస్సమ్మ కాడ పెడ్తా నంటుణ్ణింది సాయిత్రమ్మ..." తాపీగా చేప్తోన్న తిరిపాలు కేసి చూస్తూ...

"ఇహ నేమి కొండమ్మొరేః... ఆ బేరిపేట్లో పెద్ద మిస్సమ్మ అదేన్రా సొందాయమ్మ పనికి, పనికి అని పెట్టుకోని ఎద పిలకాయల్ని అయిదరాబాదులో అమ్మేస్తుండాడంట. ఆమి మొగుడే ఈ పన్లన్నీ చేయిస్తుండాడంట... ఈపొద్దు పేపర్ల నిండా అదేనంట. నాయుడుపేటంతా గబ్బు పుట్టి పొయ్యుండాదనుకో. రెడ్డోరింటికాడ చెప్పుకుంటుంటే యిని యిట్ట పరిగిత్తినా... కొండమ్మ్యాడుండాదా అని?"

తిరిపాలుకి కాళ్లూ, చేతులూ ఆడలేదు... ఊపిరి తిప్పుకోనియ్యని దగ్గుని లెక్క చెయ్యకుండా, పైగుడ్డ వుందో, లేదో చూసుకోకుండా, బనీను జేబులో చిల్లరుందో, లేదో గమనించుకోకుండా బస్టాండుకి పరిగెత్తాడు...

పేరు తెలీని పక్షేదో వికారంగా అరుచుకుంటూ ఆకాశంలో పడమటివైపు నుండి తూర్పు మూలగా పరిగెత్తుకుంటూ వెళ్లింది...

బర్రెల కాడ పేడ జవురుతుండిన రంగమ్మ 'ఓ' మంటూ ఏడుపు కెత్తుకుంది అర్థమయ్యీ, కాకుండానే.. కొళాయి నీళ్ళు పట్టుకొచ్చి సిమెంటు తొట్టిలో నింపుకుంటూండిన మీరమ్మకి కూడ దిక్కు తోచలేదు. నాయుడింటి నుండి వచ్చేసిన కొండమ్మని తిట్టి, తిట్టి మళ్లీ పనిలోకి పంపినందుకు తనలోతానే నొచ్చుకుంది. ఇక్కడే ఉండనిచ్చి వుంటే ఏదో ఒక పనీ,పాటా చేసుకునుండేది కదా అనుకుంది... ఏడుస్తోన్న రంగమ్మని ఓదార్చాలని కూడ తోచలేదామెకి. బస్సు కాడికి పరిగెడ్తోన్న మొగుడికి యిది బస్సు టయిము కాదని కూడ చెప్పాలన్పించలేదు... నిండు బిందె చంకనుంది. దాన్ని దించాలన్న ఆలోచన కూడ లేకుండా ఒంటి కతుక్కుపోయిన తడి చీరతో, కొండమ్మ తాలూకూ పశ్చాత్తాప చింతనతో నిరామయంగా చూస్తుండిపోయింది మీరమ్మ...

రంగమ్మ ఏడుపుతో యిరుగూ, పొరుగూ అంతా యింటి ముందు చేరారు. మనుషుల్ని వస్తువుల మాదిరి అమ్మేసే యిటువంటి ఉదంతాన్ని వాళ్లిదివరకెన్నడూ విని వుండకపోవడంతో అంతా నివ్వెరపోయి రంగమ్మని ఏం చెప్పి ఓదార్చాలో తెలీక తికమక పడసాగారు...

"అడ్యాడ్నో యిట్ట జరగతాయని యిన్నా గానీ మనూళ్ళో, మన పేటలో గూడ యిట్టాటిది జరగతాదని అనుకో ల్యా.." మనోళ్ల చెంగమ్మ కొడుకు నాయుడుపేటలో శూలపని చెయిడానికి దినమ్మూ పొయ్యేసొస్తాడు..." ఆ మిస్సమ్మ...

పెద్ద మిస్సమ్మకి ఎంత పేరుండాది అందర్లో... మంచి ఉద్యోగం చేస్తా గొప్పగా బతకతుండె... ఆయమ్మ కిదేం బుద్ధో?..."

"ఆఁ పొయ్యే కాలమొస్తే కుక్కమూతి పిందెలు పుడ్తాయంటారు యిదే కదా... ల్యాకుంటే ఆ నాయుడోళ్లింటికాడ లచ్చనంగా పడుండకుండా ఈ మిస్సమ్మింటికి దేనికి పొయినట్లు ఈ కొండమ్మ..."

"అయ్యో నాతల్లా కొండమ్మా ఎంత పని జరిగిపోయిందమ్మే... యింత పొట్ట కూటికి గతిలేక నువ్వాడ్యాడ్నో ఎందుకుండాలి... నాకాడుండు... నువ్వెవురి యిళ్లకాడా ఉండబళ్లేదంటినే... నా మాటినకుండా పోతివే. కొండమ్మా నా కోడలా ఎంతపని జరిగిపోయిందమ్మే..." కొండమ్మ మేనత్త శవం మీద పడి ఏడిచే ఏడుపు రాగంతో పరిగెత్తుకొచ్చింది.

మీరమ్మకి దిగులుపోయి ఒళ్లు మండుకొచ్చింది. ఈ పిలకాయల అమ్మా, నాయినా పొయ్యినప్పట్నుండీ యాపొద్దూ రంగమ్మనీ, కొండమ్మనీ యిటుకూడ రమ్మని పిల్చెరగదు. ఆ మద్దిన గవుర్మెంటు అయిపు కాలోళ్లకి డబ్బు లిస్తుండాదని అప్పుడు తీసకపోయి నాలుగు దినాలుండిచ్చికునింది. గవర్మెంటు డబ్బు లిచ్చేది నీళ్ళమీద రాసుకున్నాక వొదిలిచ్చేసుకుంది. అట్టాటి మేనత్త కొండమ్మ కోసం యాడస్తా రావడం మీరమ్మని దోషిని చేయడానికేనని అందరికీ అర్థమవుతానే ఉంది.

రంగమ్మ ఏడస్తానే ఉంది సన్నగా...

ఆ ఏడుపు ఉన్న ఒక్కగానొక్క బంధాన్ని పుటుక్కున తెంచేసిన ఎవరిమీదో తెలీని కోపాలాపన లాగుంది.

ఎవురి బాధల్నీ, సంతోషాలనీ పట్టించుకోని సూర్యుడు ఆరోజు కూడ మామూలుగానే పశ్చిమ కొండల్లోకి వెళ్లిపోయాడు.

***

నాలిక గొంతులోకి దిగబీకతా వుంది... కళ్లు మూసిన గుంటలోకి ఊడ్చుకుపోయాయి. మూడు దినాల్నాడు వెంకటయ్యొచ్చి కొండమ్మ మాట చెప్పకముందు తాగిన దాహం... మొన్న పొద్దుట్నుండీ కొండమ్మ కోసం తిరిగితిరిగీ అరిగిపోయిన కాళ్లు, మన సొంతులోనే ల్యాకుండా పేట బస్టాండులో బెంచిమీద పడున్న తిరిపాలుని నెల్లూరు నుంచి బస్సు దిగిన రాగయ్య చూసి నీళ్లు జల్లి, శోడా తాగించి, మెల్లగా బస్సెక్కించి ఊరికి తీసుకొచ్చాడు.

బస్సులో వచ్చినంత సేపూ కొండమ్మ మాటే కలవరిస్తుండాడు తిరిపాలు...

తాళాలు బిగించేసిన సాయిత్రమ్మ బడి చుట్టూ... పోలీసులు చుట్టుముట్టిన సొందాయమ్మ యింటిచుట్టూ ఆసుబోసినట్టుగా ఎట్ట తిరిగిందీ చెప్పాడు. పక్కనా, యిక్కనా ఒక్కరన్నా ముందా గుంపు కొండమ్మ పోపిడీ యివ్వలేదనీ, టవున్లో మనమాటినే వోళ్లెవురున్నాడు. పోలీసులుండేది పేదోళ్లకోసం కాదు పెద్దోళ్ల కోసమన్నాడు. పోలీసులు తన మాట పట్టిచ్చుకోకుండా ఎట్ట తరిమి కొట్టిందీ చెప్పాడు. అది రాగయ్యా అన్నాడు... ఇది రాగయ్యా అన్నాడు...

ఏడ్చి ఏడ్చి నీళ్లే లేకుండా పోయిన కళ్లల్లో యింక నెత్తురు బొట్లు కారతాయేమొనని

"అయ్యో నాతల్లా కొండమ్మా ఎంత పని జరిగిపోయిందమ్మే... యింత పొట్ట కూటికి గతిలేక నువ్వాడ్యాడ్నో ఎందుకుండాలి... నాకాడుండు... నువ్వెవురి యిళ్లకాడా ఉండబళ్లేదంటినే... నా మాటినకుండా పోతివే. కొండమ్మా నా కోడలా ఎంతపని జరిగిపోయిందమ్మే..."

ఊరుకున్నాడు... ఆ నెత్తురు కూడ తన ఒంట్లో లేదన్న ఆలోచనయితే రాలేదు తిరిపాలుకి.

నాలుగు రోజుల ముందు నెల్లూరుకి పోయిన రాగయ్యకి విషయం పూర్తిగా తెలీకపోయినా కొంత కొంత అర్థమయి తిరిపాల్ని ఓదార్చాడు.

***

"ఓయమ్మోఁ నా దేవుడి కేవయిందమ్మో" రాగయ్య భుజాని కతికించుకుని వేలాడుకుంటూ తీసుకొస్తోన్న తిరిపాలుని చూసి మీరమ్మ మతి పోయింది. నడుస్తున్న శవంలాంటి తిరిపాలునీ, రాగయ్యనీ మార్చి మార్చి చూస్తూ ఏడుపు కెత్తుకునింది.

తిరిపాలుని మెల్లిగా వాకిట్లో వున్న నులకమంచం మీద కూర్చోబెట్టాడు రాగయ్య... పేట బస్టాండులో తిరిపాలుని ఏ పరిస్థితుల్లో తాను చూసిందీ క్లుప్తంగా చెప్పి మంచినీళ్లు పట్రమ్మన్నాడు... మంచినీళ్లు తెచ్చిచ్చి

"యాందయ్యా యాడకు బొయినావు. ఆ యమ్మి మాట అట్టుండిచ్చి నిన్ను గురించి యాడవను సరిపాయనే నాకు... ఎట్ట బొయినావో ఏమొనది..." ఒకవైపు మొగుణ్ని దబాయిస్తూనే మరోవంక పమిట చెంగుతో ముక్కును ఎగ బీలుస్తోంది మీరమ్మ.

పెళ్లాం మాటలేమీ విన్పించుకోకుండా ఆలోచనలో వున్న తిరిపాలుకి హఠాత్తుగా రంగమ్మ జ్ఞాపకానికొచ్చింది. అక్క కన్పడలేదని ఈయమ్మి ఎట్ట బొయ్యిందో, ఏవయి పోయిందో ననుకుంటూ చుట్టూ కలియచూశాడు.

అప్పటికి పొద్దు గూట్లో పడతా వుంది.

దూరంగా బర్రెల్ని అదిలిస్తూ యింటికి తోలుకొస్తా ఉండాది రంగమ్మ. తేలిగ్గా ఊపిరి పీల్చి అట్నే దృష్టి సారించిన తిరిపాలు వీధి చివర కన్పించిన దృశ్యాన్ని చూసి విచిత్ర పొయ్యాడు.

ఈది చివర... అటు ఊరికీ, ఇటు మాలాడకీ పొదువుగా వున్న చింతచెట్టు కింద అరుగు పక్కన బంకులో కూర్చుని అంగడమ్ముకుంటా వుంది కొండమ్మ.

మసక చీకట్లో కొండమ్మా, కాదా అనుకుంటూ కళ్లు చికిలించిన తిరిపాల్ని గమనిస్తూ.

"మన కొండమ్మే... సాయిత్రమ్మ టీచరు కాడ్నే వుణ్ణిందంట పెద్ద మిస్సుకాడికి బోల్యా. ఇంతలోపల పోలీసులొచ్చి సొందాయమ్మనీ, మొగుడ్నీ పట్టక పోయినారు. దాంతో లింకుండాదేమొననే అనుమానంతో సాయిత్రమ్మని గూడ టేషనుకి పిల్చక పోయినారంట... సరేఁ బడి మూసేసినారు. ఎట్నో వోళ్లనీ, ఈళ్ళనీ డబ్బులడిగి బస్సెక్కి వొచ్చేసింది మనదృష్టంబో. ఈ లోపల్నే నువు బొయి అన్ని దేశాలూ చుట్టొస్తివి." వెటకారంగా అంది మీరమ్మ.

మళ్లీ తనే చెప్పింది.

"నాయుడమ్మ దీసిచ్చిన కమ్ములు కుదవబెట్టి నేనే మాధవయ్య బంకుకొచ్చినా... ఇంక్యావయినా యియ్యాల్నుంటే తర్వాతిస్తాదన్నా..."

మాట మాత్రమే కరుకయిన మీరమ్మకేసి ఆదరంగా చూశాడు తిరిపాలు. కృతజ్ఞతా భావంతో అతడి గుండె కదల బారింది. ఒక భారమైన, దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, మళ్లీ వీధి చివరికేసి దృష్టి సారించాడు తిరిపాలు... ఒకప్పుడు అంగడి పెట్టిస్తానంటే మొరాయించిన కొండమ్మ ... ఊరికి చివరగా, మాలాడ మొదట్లో వున్న ఆ చింతచెట్టు కింద కొండమ్మ ఆలోచనలు నదలెత్తి ఆమె భవిష్యత్తు కొత్తబట్టలు తొడుక్కుంటూంది. సాయంత్రం ఏడయిపోయినా వేసవికాలం కావడంతో పల్చటి వెలుతురు కిరణాలు ఆ మాలాడ మీద ప్రసరిస్తున్నాయి.

ఇక యింటికెళ్ళే సమయమయిందని కాబోలు చింతచెట్టు మీదనున్న సీతాకోక చిలుకల గుంపొకటి ఉవ్వెత్తున విశాలమయిన ఆకాశంలోకి ఎగిరింది. ■